# కాలం మారింది

కాలం మారింది, రోజులు మారాయి అనే మాటలు మనకి తరచూ వినిపిస్తుంటాయి.

'మా రోజుల్లో ఇదిలా వుండేదా?' లాటి ఉదాహరణలతో సహా మనల్ని కాలం మారిందని ఒప్పించే ప్రయత్నాలు చేసేవాళ్ళు చాలమంది.

వాళ్ళందరికీ నేను ఒకే సమాధానం చెబుతుంటాను - రోజుకి ఎప్పుడూ ఇరవై నాలుగు గంటలే, మారేది రోజులూ కాదు కాలమూ కాదు, మనుష్యులూ వాళ్ళ మనస్థత్వాలూ అని.

కాకపోతే, ఇప్పుడు చెప్పుకునేది ఈ మారే కాలం గురించీ, రోజుల గురించీ కాదు.

0 0 0

పోయినసారి నేను జపాన్ వెళ్ళినప్పుడు, టోక్యో-నరీటా అంతర్జాతీయ విమానాశ్రయంనించీ, అమెరికాలోని లాస్ ఏంజలెస్‌కి వచ్చాను. శనివారం సెలవే కాబట్టి, ప్రొద్దున్న పది గంటలకి హోటల్లోనించీ బయటికి వచ్చి, మధ్యాన్నం మూడు గంటల దాకా షాపింగ్ చేసి ఎయిర్‌పోర్ట్‌కి వచ్చాను. సాయంత్రం ఐదు గంటలకి బయల్దేరాల్సిన విమానం, సరిగ్గా ఐదు గంటలకే బయల్దేరింది.

గమ్మత్తేమిటంటే శనివారం సాయంత్రం ఐదు గంటలకి, టోక్యోలో బయల్దేరిన నేను లాస్ ఏంజలెస్ చేరేటప్పటికి, అదే రోజు అనగా శనివారం ప్రొద్దున్న తొమ్మిదిన్నర గంటలయింది! అదికూడా తొమ్మిదిన్నర గంటలు ప్రయాణం చేశాక!

'పోదురూ మరీ బడాయి! ఇదేదో 'బ్యాక్ టు ది ఫ్యూచర్' సినిమా కథలా వుంది. శనివారం మధ్యాన్నం పది దాకా హోటల్లో వున్నానన్నారు. మూడు గంటలదాకా టోక్యోలో షాపింగ్ చేశానన్నారు. ఇప్పుడేమో అంత ప్రయాణం చేసి కూడా, అదే రోజు అదే ప్రొద్దున్న తొమ్మిదిన్నరకల్లా లాస్ ఏంజలెస్‌లో వున్నానంటారు! మతి పోలేదుగదా' అనుకుంటారు అంతర్జాతీయ ప్రయాణాలు చేయని వారు.

0 0 0

మొదటిసారిగా అంతర్జాతీయ ప్రయాణాలు చేసేవారికి ఎప్పుడు నిద్ర లేవాలో, నిద్ర పోవాలో కూడా తెలీక, చికాకుగా వుంటుంది. వారం రోజుల సెలవ మీద ఇండియా వెళ్ళినవాళ్ళు, కొంతమంది మామూలు టైముకి సర్దుకునే సరికీ, మళ్ళీ వెనక్కి రావటానికి సామాను సర్దుకునే సమయం వస్తుంది.

మొదటిసారిగా లాస్ ఏంజలెస్ వచ్చిన చుట్టాలు, అట్లాంటాలోని సిరినో సుమనో ఫోన్‌లో పిలిచే సమయానికి, వాళ్ళు నిద్ర పోతుంటారు. లాస్ ఏంజలెస్‌లో

రాత్రి తొమ్మిదింటికి ఫోన్ చేస్తే, మరి అట్లాంటాలో అర్థరాత్రి పన్నెండవుతుంది.

గుంటూరునించీ ఫోన్ చేసినప్పుడల్లా టైమెంతయిందని అడుగుతుంటాడు, మా తమ్ముడి కొడుకు ఆదిత్య.

వాడికి నేను టైము చెబుతుంటే, 'అయితే నీకిప్పుడు నేను గుడ్ మార్నింగ్ చెప్పాలా, గుడ్ నైట్ చెప్పాలా' అని అనుమానంగా అడుగుతుంటాడు కూడాను.

'మరి మనుష్యులే మారతారు కానీ, రోజులూ మారవు, కాలమూ మారదు అన్నావిందాక. ఇప్పుడేమో రోజులూ మారతాయి, కాలమూ మారుతుంది అంటావు, నువ్వే మారావు' అనకండి. అసలు ఈ తేడాలు ఎలా వచ్చాయో, ఎంత తేడాలో, దీనికి ప్రామాణికం ఏమిటో చూద్దాం. తెలుసుకున్న కొద్దీ తమాషాగా వుండే విషయం ఇది.

0 0 0

భూమి గుండ్రంగా వుందని మనకందరికీ తెలుసు. ముందు తూర్పూ పడమరల పరంగా చూద్దాం. ఇండియాకీ, అమెరికాకీ ఒక చోట రాత్రయితే, ఇంకో చోట పగలు. టెక్సాస్‌లోని ఆస్టిన్‌కీ, మా గుంటూరుకీ పదకొండున్నర గంటల తేడా వుంది. గుంటూరు ఆస్టిన్ కన్నా పదకొండున్నర గంటలు ముందుంది. గుంటురు నించీ బయల్దేరి, భూమి చుట్టూతా ఒకసారి కాలమానం ప్రకారం చూస్తే 24 గంటలు అవాలి. అందుకనే దారిలో ఇన్ని రకాల సమయాలూ, తేడాలు. ఇది తెలుసుకోవటానికి తెలివితేటలూ అక్కర్లేదు, ఇదేదో అద్భుతమూ కాదు.

ఈ తేడాలతో సతమతమవటం ఎందుకని, పెద్దలు భూమి చుట్టూరా, ఉత్తర దక్షిణ ధ్రువాల మీదుగా ఒక ఊహాపరమైన గీత గీశారు. అది పశ్చిమ యూరప్ మీదనించీ, ఆఫ్రికా ఖండం మీదనించీ చుట్టు తిరిగి, పసిఫిక్ సముద్రం మీదుగా మళ్ళీ యూరప్ చేరుతుంది. దీన్ని గ్రీన్‌విచ్ లైన్ అనీ, పసిఫిక్ సముద్రం మీద 'అంతర్జాతీయ కాలమాన రేఖ' (ఇంటర్నేషనల్ డేట్ లైన్) అనీ అంటారు. పశ్చిమ యూరప్ మీదుగా వెళ్ళే చోట చూపించే సమయాన్ని, గ్రీన్‌విచ్ మీన్ టైం (జి.ఎం.టి.) అంటారు. అక్కడినించీ తూర్పుగా, అంటే ఇండియా దిశగా చూపే సమయం గ్రీన్‌విచ్ సమయానికన్నా ముందుగానూ (అంటే కాలమానంలో ముందుగా), పడమరగా అంటే అమెరికా దిశగా చూపే సమయం గ్రీన్‌విచ్ సమయానికి తర్వాతనూ వుంటుందన్న మాట. ఉదాహరణకి శనివారం మధ్యాహ్నం పన్నెండు గంటలకి జి.ఎం.టి. సమయం అయితే, అప్పుడు ఇండియాలో శనివారం సాయంత్రం అయిదున్నర అవుతుంది. అదే టైముకి ఆస్టిన్‌లో శనివారం తెల్లవారు ఝామున ఆరు గంటలవుతుంది. మా వూరు దాటి పడమర దిక్కుగా వెడుతుంటే సమయం ఇంకా వెనుకబడుతుంది. ఇండియా దాటి తూర్పు దిక్కుగా వెడుతుంటే, వాళ్ళు ఇండియా కన్నా ఇంకా ముందు వుంటారు. మరి ఈ తూర్పూ పడమరల కాలగమన సంగమం ఎక్కడ? ఎప్పుడు?

ఎక్కడో ఇందాకే చెప్పుకున్నాం 'అంతర్జాతీయ కాలమాన రేఖ' దగ్గరని. ఎప్పుడు అంటే జి.ఎం.టి. సమయానికి సరిగ్గా పన్నెండు గంటలు గడిచాక. అంటే

శనివారం మధ్యాహ్నం పన్నెండు గంటల జి.ఎం.టి. సమయం ఉదాహరణగా తీసుకుంటే, అర్ధరాత్రి పన్నెండు గంటలకి అని సులభంగా చెప్పేయవచ్చు.

అయితే ఆదినారాయణగారు ఆదివారం కదా అంటారు, శనేశ్వరావుగారు శనివారం కదా అంటారు. మరి మీరు ఎవరితో ఏకీభవిస్తారు?

ఇద్దరితోనూ, వాళ్ళు వుండే స్థలాలని బట్టి. అదే సమయంలో ఆదినారాయణగారు ఫిజి దీవుల్లో వుంటే ఆదివారం. అదే సమయంలో శనేశ్వరావు గారు అలాస్కాలోనో సమోవా దీవుల్లోనో వుంటే శనివారం. అంతర్జాతీయ కాలమాన రేఖ ఆర్కిటిక్, అంటార్కిటిక్ ప్రదేశాల్లో తప్ప దాదాపుగా సముద్రం మీదే వుంటుంది.

కాకపోతే ఫిజీ దీవుల దగ్గర, బోటులో 'లాహిరి లాహిరి లాహిరిలో' అని పాడుకుంటూ వెడుతుంటే, సమయంలో ఒక్క నిమిషమే తేడా వున్నా హఠాత్తుగా పాట మార్చి, 'రోజులు మారాయ్, రోజులు మారాయ్, మారాయ్, మారాయ్, రోజులు మారాయ్' అని ఏరువాక పాట పాడుకోవలసి వస్తుంది.

0 0 0

సరేనండీ తూర్పు పడమరల పరంగా కాలయానం గురించి చెప్పారు, మరి ఉత్తర దక్షిణాల పరంగానో అని అడుగుతున్నారు జగ్గయ్యపేటనించీ జగ్గయ్యగారు. వస్తున్నాను జగ్గయ్యగారూ. అదే చెప్పబోతున్నాను.

ఉత్తర దక్షిణాల పరంగా సమయంలో తేడా వుండదు, ఎక్కడో ఉత్తర దక్షిణ ధ్రువాలకి దగ్గరవుతున్నప్పుడు తప్ప. ఎందుకంటే భూగోళానికి పై కప్పునా, క్రింది భాగానా ఈ నిలబడిన కాలమాన గీతలు (వర్టికల్ టైం జోన్ లైన్స్) బాగా దగ్గరయిపోతాయి కనుక. కాకపోతే భూమధ్య రేఖకి ఎంత దూరంలో వున్నాం అనే దాన్ని బట్టి, ఎంత తొందరగా తెల్లవారుతుంది, లేదా చీకటి పడుతుంది అని తెలుస్తుంది.

మామూలుగా ఆరున్నరకి చీకటి పడుతుంది ఆస్టిన్‌లో. కానీ ఎండాకాలం రాత్రి తొమ్మిదింటి దాకా వెలుతురుగానే వుంటుంది. మా అమ్మ ఇక్కడికి వచ్చినప్పుడు అంటుండేది, 'ఏమిట్రా... తొమ్మిదవుతున్నా ఇంకా చీకటి పడదు' అని. ఇండియాలో చీకటి పడితే కాని, భోజనాలు చేయం కదా మరి!

నేనొకసారి జూన్ నెలలో కెనడాలోని బానిఫ్ అనే వూరికి ఒక కాన్ఫరెన్స్‌కి వెళ్ళాను. అది కాల్గెరీ దాటి ఇంకా ఉత్తర దిక్కుగా, ఉత్తర ధ్రువం వేపు వెళ్ళాలి. బిజినెస్ డిన్నర్ పూర్తి చేసుకుని, రాత్రి పదింటికి రూంకి వచ్చి పడుకున్నా, కిటికీలో నించీ సూర్యుడు కనిపిస్తూనే వుంటాడు. రాత్రి పన్నెండింటికి కాబోలు చీకటి పడి, మళ్ళీ కొంపలంటుకున్నట్టు ప్రొద్దున్న రెండు గంటలకే వెలుతురు వచ్చేస్తుంది. కిటికీ తలుపులు మూసేసుకుని, దుప్పటి ముసుగు పెట్టుకుని పడుకోవాల్సి వచ్చింది.

పగలే వెన్నెల సంగతి ఏమో కానీ, రాత్రే వెలుతురయిపోయి, అక్కడవున్న ప్రతి రాత్రీ నిజంగా పగటి రాత్రే అయింది.

0 0 0